

జనగామ జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

# రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు విజయం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 5 : నిజామాబాద్ జిల్లా భూసాపూర్‌లో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరుగుతున్న రాష్ట్ర స్థాయి 70వ సీనియర్ మహిళా కబడ్డీ పోటీల్లో జనగామ జిల్లా జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. పూల్-సీలో జిల్లా జట్టు హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 24/21 పాయింట్లు, ఆసిఫాబాద్‌తో 35/16, నాగర్ కర్నూల్‌తో 27/12 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, టీమ్ కోచ్ డాక్టర్ తోటకూరి వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ జిల్లా కబడ్డీ జట్టు కెప్టెన్ పన్నీరు ధనుష సారథ్యంలో క్రీడాకారులందరూ ఉత్తమ ప్రతిభకనబరుస్తున్నారని తెలిపారు. క్రీడాకారులకు ఆయన అభినందనలు తెలిపారు. జిల్లా టీమ్‌కు మేనేజర్‌గా కుడుముల మైథిలి వ్యవహరిస్తున్నట్లు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కబడ్డీ పోటీల్లో మరిన్ని ఫలితాలు సాధిస్తామని ఆయన పేర్కొన్నారు.

# అధైర్యపడేది లేదు.. ప్రజల్లోనే ఉంటా

- ప్రజా తీర్పును గౌరవిస్తున్నా
- గెలిచిన వారు పెండింగ్ పనులను పూర్తి చేయాలి
- నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తా
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, డిసెంబర్5: తన జీవితాంతం పోరాటమేనని, అధైర్య పడేది లేదని, ప్రజల్లోనే ఉంటానని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని అన్నారు. తన పని విధానంలో మార్పులు చేసుకోవాలని గమనించానని పేర్కొన్నారు. ఉద్యమ కాలంలోనూ తాను ఓడిపోయానని, మొదటి అసెంబ్లీ సమావేశానికి ఎన్నిక కానిది తానొక్క ఉద్యమకారుడినేనని అన్నారు. ఐదేండ్లకోసారి వచ్చే నాయకుడిని ప్రజలు కోరుకుంటున్నారా అనేది చర్చ జరగాలన్నారు. నన్ను దెబ్బకొట్టడానికి ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు ఒక్కటయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గానికి పథకాలను తెచ్చినట్లు తెలిపారు. పాకాల, రంగాయ చెరువుల కింద కాల్వలు పూర్తి చేయాలని, పనులు చాలా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఇప్పుడు గెలిచిన నాయకులు వాటిని పూర్తి చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జిలను పోరాడి తెచ్చి ఇటీవలే శంకుస్థాపన చేసుకున్నామని, వాటిని కూడా పూర్తి చేయాలని కోరుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపును తెచ్చానని, రైతులు, ప్రజలకు ఆపదలో, తుఫాను సమయంలో కూడా అందుబాటులో ఉన్న తనకు ప్రజలు ఈ స్థాయిలో తీర్పును ఇస్తారని ఊహించ లేదని అన్నారు. తనకు రాజకీయాలు రావని, ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన కాబట్టి కుట్రలు రావన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేద్దామని డిజైన్లు తయారుచేసి పెట్టుకున్నానని, కానీ ప్రజల తీర్పు వల్ల ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు. నర్సంపేటను వదిలిపెట్టి తాను ఎప్పుడు బయట ఉన్నది లేదని అన్నారు. ఎప్పుడూ ప్రజలకు సేవ చేయడమే తెలుసని అన్నారు. ఎమ్మెల్యే అంటే ఒక బాధ్యతగా ప్రజలు, కార్యకర్తల కోసం పనిచేశానని అన్నారు. హార్టికల్చర్ యూనిట్ కోసం ఫారెస్టు అధికారులతో కేసుల పాలయ్యానని తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి తెచ్చిన పనులు నేనెందుకు చేయాలని ఇప్పుడు గెలిచిన నాయకులు భావించకుండా ప్రజల కోసమైనా పనులు పూర్తి చేయాలని కోరారు. నర్సంపేటలో రూ. వందల కోట్ల నిధులు మంజూరు చేసి ఉన్నాయని అన్నారు. వాటిని ల్యాప్స్ చేయవద్దని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సంపూర్ణంగా సహకరిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి, రాయిడి రవీందర్‌రెడ్డి, గుంటి కిషన్, నల్లా మనోహర్‌రెడ్డి, మునిగాల వెంకట్‌రెడ్డి, కోమాండ్ల గోపాల్‌రావు, నామాల సత్యనారాయణ, దార్ల రమాదేవి, బండి రమేశ్, నాగిశెట్టి ప్రసాద్, కొమ్ము రమేశ్‌యాదవ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న వ్యవసాయ విద్యార్థులు



రైతులకు సర్టిఫికెట్లను అందిస్తున్న అధికారులు

# నేల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి


- ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ర్యాలీ

కాశీబుగ్గ, డిసెంబర్5: నగరంలోని 3వ డివిజన్ కొత్తపేటలో మంగళవారం ప్రపంచ మృత్తికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ వ్యవసాయ కళాశాల వారు ఎస్‌బీఐ వారి సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులను పట్టుకొని నేల ఆరోగ్యం, పరిరక్షణపై ర్యాలీ తీశారు. అనంతరం జరిగిన సమావేశంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం బలరాం మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్ష ఆధారంగా రసాయనిక ఎరువులతో పాటుగా సేంద్రియ ఎరువులను కలిపి వేసుకోవాలన్నారు. డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల మోతాదు తగ్గించాలన్నారు. జీవ, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులతో పాటు కలిపి వేసుకున్నట్లయితే నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే కాకుండా నీటి కాలుష్యం, వాతావరణ మార్పులను కొంత మేరకు అదుపులో ఉంచుకోవచ్చన్నారు. అలాగే రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బ్లేజ్ డిసౌజా, డాక్టర్ సీహెచ్ అనూష, హారిక, గోపిక, స్వాతి, వంశీకృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి, ఎస్‌బీఐ ప్రతినిధులు శ్రీనివా సరావు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 5: ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని ఇతర ఉద్యోగులు పనిచేసి అవార్డులు పొందాలని ఆర్ఎం శ్రీలత అన్నారు. వరంగల్ రీజియన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అవార్డుల ప్రదానోత్సవం వరంగల్-1 డిపోలో నిర్వహించారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ త్రైమాసికంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం శ్రీలత మాట్లాడుతూ అందరూ కష్టపడి పనిచేస్తూ సంస్థను లాభాల బాటలోకి తీసుకురావాలన్నారు. దసరా, దీపావళి, ఎన్నికల సందర్భంగా ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపి ప్రయాణికులను సమర్థవంతంగా తరలించారని, ఈ సందర్భంగా శ్రావణమాసం, రాఖీ చాలెంజ్ సాధించిన వరంగల్ రీజియన్ ఉద్యోగులు అదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులకు క్యాష్ అవార్డులు, ప్రశంసాపత్రాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు మాధవరావు, కేశరాజు భానుకిరణ్, ఏవో, పీవో, తొమ్మిది డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులతో ఆర్ఎం శ్రీలత

# ఎన్నికల్లో పోలీసుల పనితీరు అభినందనీయం: సీపీ

సుబేదారి, డిసెంబర్ 5: ఎన్నికల నిర్వహణలో పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం పోలీసు అధికారులకు ఎన్నికల నిర్వహణ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో వరంగల్ పోలీసు కమిషనరేట్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేశారన్నారు. ఎక్కడ కూడా అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేశారని అన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, సీసీఆర్‌బీ ఏసీపీలు జితేంద ర్‌రెడ్డి, మధుసూదన్, కృష్ణ, ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బందికి సీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు.



పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సీపీ



శివలింగం చుట్టూ దీపాలను వెలిగించిన భక్తులు

# ఆలయాల్లో కార్తీక పూజలు

- శివలింగాకారంలో దీపాలు వెలిగించిన భక్తులు

గోవిందరావుపేట, డిసెంబర్ 5 : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని చల్వాయి, గోవిందరావుపేట ఆలయాల్లో సో మవారం రాత్రి ఘనంగా కార్తీక మాసోత్సవా లు నిర్వహించారు. చల్వాయిలోని రామలింగేశ్వరాలయం, గోవిందరావుపేటలోని హరిహర క్షేత్రంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని శివపార్వతుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే శివలింగ ఆకారంలో పూలను అలంకరించి, వేయి దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు.



శివపార్వతుల ప్రతిమలను పూలతో అలంకరించిన భక్తులు